

## గోవిందునికి లక్ష తులసీ దళార్చన


సూళ్లూరుపేట, మే 31 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీమద్వేంకట రామమూర్తి ఆలయంలో బుధవారం వేంక టేశ్వర స్వామికి లక్ష తులసీ దళా ర్చన పూజలు నిర్వహించారు. 'మత త్రయ ఏకాదశి' సందర్భంగా స్వామివారికి లక్ష తులసీ దళార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిపిం చారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని భక్తుల స్వహస్తాలతో తులసీ దళాలతో పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో తులసీ దళార్చన పూజలు నిర్వహించారు.




## "హద్దు"లు మార్చారు....
# అవగాహన మరిచారు!

**పోలీసుస్టేషన్‌ల పరిధుల మార్పుపై జనంలో చైతన్యం అవసరం!!**



ప్రభాతవార్త–తిరుపతి:

తిరుపతి జిల్లా ఆవిర్భవించిన ఏడాది తరువాత తిరుపతి పోలీసు జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌ల సరి"హద్దు"ల మార్పులు తీసుకువచ్చిన అధికారులు ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించడంపై దృష్టి సారించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిరోజూ పోలీసుస్టేషన్‌లకు వస్తున్న బాధితుల సంఖ్య కూడా భారీగానే ఉంటుంది. చిన్నచిన్న గొడవలు పడినా న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించడం పరిపాటిగా మారింది. ఇది వరకు తలెత్తిన హద్దుల సమస్యలు కొంతవరకు సానుకూలంగానే మార్పుచేస్తూ ప్రభుత్వం గెజిట్ జారీచేసింది. పోలీసుస్టేషన్‌ల పరిధులు మార్పుచేసిన విషయంపై స్థానిక డివిజన్,కాలనీ ప్రజలకు అవగాహనకల్పించి,వారిలో చైతన్యం తీసుకురావాల్సి న అవసరం కూడా ఉందనేది ఇప్పుడు చర్చకు తావిస్తోంది. ఎప్పుడో బ్రిటీష్‌కాలంనాటి పోలీసు పరిస్థితులు ,హద్దులు తిరుపతి డివిజన్‌లో అమలై సమీప పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే కాలనీ వాసులు నివాసముంటున్నా ఎక్కడో దూరంగా ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళాల్సి రావడం, దగ్గరలో ఉన్న పోలీసుల ముందు గొడవపడినా, రోడ్డుప్రమాదం జరిగినా మాదికాదు లే అన్నట్లు ప్రేక్షకపాత్ర వహించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. హద్దుల గొడవలతో అటు పోలీసులు ఇటు బాధితులు తిరుపతిలోనే తలలుపట్టుకున్న ఘటనలు లేకపోలేదు. తిరుపతి జిల్లా కావడంతో తిరుపతి నగరం జనాభాను బట్టి, విస్తరించిన నగరం పరిసరాలతో జిల్లా ఎస్‌పి తిరుపతి డివిజన్‌లలో మార్పులు తీసుకువచ్చారు. ఇదివరకు తిరుపతి ఈస్టు, వెస్టు సబ్‌డివిజన్లుగా పాలన సాగేది. నగరంలోనే ఉన్న మూడు పోలీసుస్టేషన్‌లు ఈస్టు డిఎస్పీ పర్యవేక్షణలో, మరోనాలుగు పోలీసుస్టేషన్‌లు వెస్టు డిఎస్పీ పర్యవేక్షణలో ఉండేవి. ఈ పోలీసుస్టేషన్‌ల హద్దులు కూడా ప్రజలకు గందరగోళంగా మారాయి. వీటన్నిటీని మార్పుచేస్తూ నగరవాసులకు మరింత దగ్గరగా పోలీసుల సేవలు అందేలా హద్దులను సరిదిద్ది మార్పులుచేశారు. వీటిపై నగరవాసుల్లో బ్యానర్లు, ప్లకార్డులతో చైతన్యం తీసుకురావాల్సి న అవసరం ఉంది.

**-ఒక సబ్‌డివిజన్‌క్రింద అనేక ప్రాంతాలు:**

తిరుపతి నగరంలో పోలీసుస్టేషన్‌ల హద్దులు మార్పులు చేయడంతో దీనిపై జనానికి అవగాహన కల్పించడంలో పోలీసు అధికారులు దృష్టి సారించలేదు. నూతనంగా అమలవుతున్న మార్పులు గురువారం నుంచి అందుబాటులోకి వస్తున్నాయి. ఇలా తిరుపతిలో ఒకే సబ్‌డివిజన్‌గా చేస్తూ తిరుపతి ఈస్టు ,అలిపిరి, వెస్టు, ఎస్వీయూనివర్సి టీ పోలీసుస్టేషన్‌లను ఒకే గొడుగుక్రిందకు చేర్చారు. ఎంఆర్‌పల్లి ,తిరుచానూరు పోలీసుస్టేషన్‌లను రూరల్‌గా పరిగణిస్తూ చంద్రగిరి సబ్‌డివిజన్‌కు మార్పుచేశారు. ఈస్టు,వెస్టు, అలిపిరి, ఎస్వీయూ,తిరుచానూరు, ఎంఆర్‌పల్లి పోలీసుస్టేషన్‌ల పరిధిలోని అనేక ప్రాంతాలు, కాలనీలు సమీప పోలీసుస్టేషన్ క్రిందకు చేర్చారు. వీటిపై ఆయా ప్రాంతాల స్థానిక ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాల్సి ఉంది. చాలావరకు స్థానికంగా ఉంటున్న ప్రజలు కార్మికులు, చిన్నచిన్న పనులు, ఉద్యోగాలు చేసుకుని జీవనం సాగించేవారే. ఇప్పుడు స్టేషన్‌ల హద్దులు,కొత్తగా ఏ పోలీసుస్టేషన్ పరిధిలోకి ఆయా కాలనీలు వస్తాయనే దానిపై పూర్తిస్థాయిలో చైతన్యం తీసుకురావాల్సి న అవసరం ఉంది. ఇందుకు సంబంధిత పోలీసుస్టేషన్‌ల సిఐలు, ఎస్‌ఐలు, బ్లూకోల్ట్స్ పోలీసులు, గస్తీ పోలీసులతో సదస్సు లు నిర్వహించి అవగాహన కల్పిస్తే తప్ప ఏ పోలీసుస్టేషన్‌కెళ్ళాలనేది అయోమయమే. దీన్ని పరిష్కరించి గతంలో మైత్రి సంఘాల తరహాలో ఇప్పుడు పోలీసుస్టేషన్‌ల హద్దులపై జనంలో మరింతగా చైతన్యం తీసుకువస్తే తప్ప సార్థకత ఉండదు. తిరుపతి జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి ఆ దిశగా దృష్టి సారిస్తారని ఆశిద్దాం.

# టపాసుల గోదాములో అగ్నిప్రమాదం

## ముగ్గురు మృతి : ఇద్దరి గాయాలు









వరదయ్యపాళెం,మే 31 ప్రభాతవార్త

సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలం కువ్వాకోలి పంచాయతీ పరిధిలోని ఎల్లకట్టవ గ్రామానికి సుమారు అర్ధకిలో మీటర్ దూరంలో గ్రామానికి చెందిన వీరయ్య అనే వ్యక్తి టపాసుల గోదాము నిర్వహిస్తున్నారు. ఈ గోదాములో బుధవారం మధ్యాహ్నం సుమారు 2.30గంటల ప్రాంతంలో ప్యాకింగ్ సందర్భంగా ప్రమాదం జరిగినట్లు సమాచారం. గోదాములో అగ్ని ప్రమాదం చోటు చేసుకోగా మంటలు ఎగిసి పడుతుండటంతో గ్రామస్థులు పరుగులు తీసారు. సమీపంలోని పంట పొలాల్లోంచి నీటితో మంటలను ఆపటానికి ప్రయత్నించారు.కానీ ప్రయోజనం లేకపోయింది. ప్రత్యేక్ష గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు ఇలా ఉన్నాయి.

**ముగ్గురు మృతి:**

ఎల్లకట్టవ గ్రామంలోని గోదాములో సూళూరుపేటలో జరుగు తిరు నాళ్ళకు అంతేకాక పరిసర గ్రామాల్లో జరిగే జాతరల కోసం టపాసులను ప్యాకింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం అయితే ఇక్కడ గోదాముకు మాత్రమే అనుమతి ఉండగా తయారు చేస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. అయితే మద్యాహ్నం జరిగిన సంఘటనలో అక్కడి కక్కడే ముగ్గురు మాడి మసి అయిపోయారు. మృతి చెందిన వారిలో నాగేంద్ర (30), పి.శంకరయ్య(45),ఏడు కొండలు(33)లు ఉన్నారు. అలాగే గాయపడిన వారిలో యజమాని వీరయ్య, పవన్ కళ్యాణ్ అనే యువకులున్నారు.తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వాస్తవ సంఘటనను పరిశీలిస్తున్నారు.

**కుటుంబాల్లో విషాదం:**

వరదయ్యపాళెం మండలం కువ్వాకోలి పంచాయతీ ఎల్లకట్టవ గ్రామంలో టపాసుల గోదాములో జరిగిన సంఘటనలో మృతి చెందిన యువకుల కుటుంబాల్లో విషాదం చోటు చేసుకుంది.నాగేంద్ర అదే గ్రామానికి చెందిన యువకుడు ఆతనికి ఇటీవలే వివాహమైంది. ఆతనికి భార్య మూడేళ్ళ కుమార్తె, ఒకరిన్నర సంవత్స రం కుమార్తె ఉన్నట్లు సమాచారం. కాగా ఏడుకొండలు స్వస్థలం గూడూరు.ఆయన బతుకు జీవనం కోసం టపాసుల గోదాములు పని చేయటానికి వచ్చారు. ఆతనికి భార్య 4 సంవత్స రాల కుమారుడు, 2 సంవత్స రాల కుమార్తె ఉన్నట్లు సమాచారం. శంకరయ్యకు ఇద్దరు కుమారులు,ఇద్దరికి వివాహామైనట్లు సమాచారం. బతుకు జీవనం కోసం యువకులు టపాసుల గోదాముల్లో పని చేయటానికి వెళ్ళి మృత్యు కౌగిలిలో ఒదిగిపోవటంతో ఆ కుటుంబాల్లో విషాదం చోటు చేసుకుంది. గ్రామంలో ఏడుపులు,పెడబొబ్బలు చోటు చేసుకుంది. కుటుంబపోషకులుమృత్యువాత పడగా పసి బిడ్డలను ఎలా పోషించుకోవాలనే ఆర్తనాదాలు చోటు చేసుకున్నాయి.

**మంటలను ఆర్పటానికి పరుగులు:**

ఎల్లకట్టవ్ గ్రామంలో టపాసుల గోదాములో ప్రమాదం జరిగిన సంఘటనతో అధికారులు పరుగులు తీసారు. సత్యవేడు సిఐ శివకుమార్‌రెడ్డి, వరదయ్యపాళెం ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి, వరదయ్య పాళెం తహాశీల్దార్ గౌరీశంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంటలను ఆర్పటానికి సత్యవేడు, శ్రీకాళహస్తి అగ్నిమాపక శాఖ అధికారులు వాహనాలను రప్పించారు.వరదయ్యపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి
# బ్రహ్మోత్సవాలు ప్రారంభం





వడమాలపేట, మే 31 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్స వాలు బుధవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్స వాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7 నుంచి 7.30 గంటల మధ్య మిథున లగ్నంలో వైఖనసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టం జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ ఈ కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవలోస్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు స్వామివారికి తిరుచ్చి ఉత్స వం నిర్వహించారు. ఈ ఉత్స వం ద్వారా తన బ్రహ్మోత్స వాల ఏర్పాట్లను స్వామివారు ముందుగా పర్యవేక్షిస్తారు. అనంతరం మిథున లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్నవెంకటేశ్వర స్వామివారి సమక్షంలో ధ్వజా రోహణం నిర్వహించారు. అనంతరం కంకణ భట్టార్ తిప్పయ్య చార్యులు ఆధ్వర్యంలో ఆ స్థానం జరిగింది. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు ఉభయదేవేరిలతో పాటు స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయం త్రం స్వామివారికి ఊంజల్‌సేవను నిర్వహించారు. రాత్రి 7 గంటలకు పెద్ద శేష వాహనాన్ని అధి రోహించి మాడవీధుల్లో విహరించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్ స్పెక్టర్ శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారా చార్యులు, రమణాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## వైయస్సార్ రైతు భరోసా
# పి.యం.కిసాన్ ఆర్థిక సాయం రూ.133.48కోట్లు

**-ఆకాల పంట నష్ట పరిహారం రూ.32.93లక్షలు**
**-కలెక్టర్ వెంకట రమణారెడ్డి**



తిరుపతిరూరల్, మే31 ప్రభాతవార్త:

2023-24 సంవత్స రానికి గాను వైయస్సా ర్ రైతు భరోసా - పి.యం.కిసాన్ కింద వరుసగా ఐదో సంవత్స రం మొదటివిడత ఆర్థిక సాయం నగదు బదిలీ కార్యక్రమాన్ని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహాన్‌రెడ్డి కర్నూల్ జిల్లా, పత్తికొండ మండలం నుండి బటన్ నొక్కి, రైతుల ఖాతాల్లో జమ చేస్తారని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలో 1,76,921 మంది భూ యజమాని రైతులకు, కౌలు, ఆర్ఓఎఫ్ఆర్ సాగు రైతులకు రూ.7500 చొప్పున సుమారు రూ.133.48 కోట్ల రుపాయాల లబ్ది చేకూరనున్నదని తెలిపారు. జిల్లాలో మార్చి 23 నుండి మే 23 వరకు కురిసిన ఆకాల వర్షాలకు పంట నష్ట పరిహారం 416మంది రైతులకు 32.93లక్షలు జమ కానున్నదని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రంలోని రైతులందరికి సాగు ఖర్చు కింద పెట్టుబడి సహాయం అందించాలనే ఉద్దేశ్యంతో అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి సంవత్స రానికి రూ.13,500 చొప్పున 2019 సంవత్స రం నుండి వైయస్సా ర్, రైతు భరోసా-పి.యం.కిసాన్ పథకము కింద ఆర్థిక సాయాన్ని రైతుల ఖాతాల్లో నేరుగాఆ జమ చేయుచున్న విషయం అందరికి తెల్సి న విషయమే. జిల్లా స్థాయి కార్యక్రమం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట డివిజన్ తడ మండలం ఎస్ఆర్ఎం గ్రౌండ్‌ఇయర్ కల్యాణమండపంలో జూన్ 1న ఉదయం 10గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు అందరూ పాల్గొని, జయప్రదం చేయాలని కలెక్టర్ కోరారు.

## గజవాహానంపై గోవిందుడు



తిరుపతి, మే 31 ప్రభాతవార్త:

గోవిందరాజస్వామి బ్రహ్మోత్స వాల్లో ఆరవరోజు బుధవారం రాత్రి స్వామి గజవాహనాన్ని అధిరో హించి మాఢవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చాడు. రాజులకు విజయచిహ్నంగా గజాలపై యుద్ధాలకు వెళతారు.అంతటి శక్తివంతమైన గజాన్ని గోవిందుడు వాహనంగా చేసుకుని గజేంద్ర మోక్షకుడు దర్శనమివ్వడం శుభకరం. రాత్రి 7గం టలకు అర్చకులు కర్పూరహారతులిచ్చి వాహనం బయలుదేరింది. భక్తులు గోవిందా... గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. వాహనసేవ అనంతరం శ్రీదేవిభూదేవిసమేత గోవిం దరాజస్వామి ఉత్స వర్లకు విశేష స్నపన తిరు మంజనం నిర్వహించారు. ఆలయంలో వసం తోత్స వం జరిగింది. వాహనసేవలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, కంకణ భట్టార్ ఏపి శ్రీనివాస దీక్షితులు,ఆలయ డిప్యూటీ ఇఒ శాం తి, ఎఇఒ రవికుమార్, సూపరింటెండెంట్ నారా యణ, ఆలయ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

## మొదలైన భూముల రిజిస్ట్రేషన్లు

కుప్పం, మే 31 ప్రభాతవార్త

రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్ బుధవారం ఉదయం నుంచి అందు బాటులో రావడంతో అటు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, ఇటు భూ ముల కొనుగోలు, విక్రయదారులు ఊపిరి పీల్చుకున్నారు. సోమ, మంగళవారాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్లు రెండు రోజులపాటు ఆగిపోయాయి. మరో పక్క భూముల ధరలను ప్రభుత్వం పెంచుతుందనే ఊహాగానాలు సైతం రావడంతో భూముల కొనుగోలు,విక్రయదారులు కొంత ఆందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం ఒకటి రెండు రిజిస్ట్రేషన్లు పాత విధానంలోనే జరగ్గా సర్వర్ అందుబాటులో వచ్చేసింది. బుధవారం కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 51 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య తెలిపారు.






## వైభవంగా శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు

తిరుచానూరు, మే 31, ప్రభాతవార్త

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్స వాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీ కృష్ణ స్వామి వారు పద్మసరోవరంలో తెప్పపై మూడు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 నుండి 4 గంటల వరకు శ్రీ కృష్ణ స్వామి వారి ముఖ మండపంలో శ్రీ కృష్ణస్వామి వారికి వేడుకగా అభిషేకం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు స్వామి, అమ్మవారి ఉత్స వమూర్తిలను పద్మ పుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు తెప్పోత్స వం వైభవంగా జరిగింది. అనంతరం శ్రీ కృష్ణస్వామి వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులకు కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, సూపర్ టెండెంట్స్ శేషగిరి, మధు, ఆలయ ఇన్స్పెక్టర్ ప్రసాద్, గణేష్, అశోక్, సుభాస్కర్, ఏవిఎస్‌వో శైలేంద్ర బాబు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు బదిలీ కౌన్సెలింగ్



చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లాలో ఒకే స్టేషన్‌లో ఐదు సంవత్స రాలు విధులు పూర్తి చేసుకొన్న ఎస్ఐ క్యాడర్ నుండి కానిస్టేబుల్ క్యాడర్ వరకు బుధవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి, అడ్మిన్ ఎఎస్పీ సుధాకర్‌ల ఆధ్వర్యంలో బదిలీ కౌన్సె లింగ్ నిర్వహించి పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. ఈ బదిలీ కౌన్సె లింగ్ ద్వారా 40 మంది పోలీసులు బదిలీ అయ్యారు. ఇందులో 13 మంది ఎఎస్ఐలు, ఏడు మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 20 మంది కానిస్టేబుళ్ళు వున్నారు. ఈ మేరకు బదిలీపై కొత్త పోలీస్ స్టేషన్లకు విధులు నిర్వర్తించడానికి వెళ్తున్న పోలీసు సిబ్బంది పోలీసు ప్రతిష్ట పెంచేలా విధులు నిర్వర్తించాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, డిపిఓ క్లర్క్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీలపై అర్ధరాత్రి వరకు కసరత్తు

చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:

ఉద్యోగుల బదిలీలపై అర్ధరాత్రి వరకు కసరత్తు కొనసాగుతుంది. ఉద్యోగుల బదిలీలపై అంక్షలను ప్రభుత్వం బుధవారం అర్ధరాత్రి వరకు సడలించడంతో ప్రభుత్వ శాఖల అధికారులు ఉద్యోగుల బదిలీపై గత రెండు రోజులుగా కసరత్తు చేపట్టారు. సురక్షిత స్థానాలకు బదిలీ చేసుకోవడం కోసం ఉద్యోగులు తమ పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో ఇప్పటికే బదిలీ దరఖాస్తులు చేసుకొన్నారు. ఈ దరఖాస్తులను ఉన్నత అధికారులు పరిశీలించి బదిలీ ప్రక్రియను చేపట్టి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాల్సి వుంది. ఉద్యోగుల బదిలీల్లో కీలకమైన రెవెన్యూ శాఖలో తహసిల్దారు, డిప్యూటీ తహసిల్దార్లు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, విఆర్‌ఓల బదిలీలు జరుగాల్సి వుంది. ఈ బదిలీలు అన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టాల్సి వుండటంతో ఈ బదిలీలను పక్కాగా చేపట్టడానికి కలెక్టరేట్ అధికారులు గత రెండు రోజులుగా కసరత్తు చేస్తున్నారు. అయినప్పటికీ బుధవారం అర్ధరాత్రికి సైతం ఈ బదిలీలు ఒక కొలిక్కి రాని పరిస్థితి ఏర్పడింది. బుధవారం అర్ధరాత్రి లేదా గురువారం రెవెన్యూ బదిలీలపై ఉత్కంఠత వీడనుంది. అలాగే పంచాయితీరాజ్ శాఖ పరిధిలో ఎంపిడిఓలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, తదితర బదిలీలు చేపట్టాల్సి వుంది.

ఈ బదిలీలు జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలు కలిసి చేయాల్సి వుండటం, ఈ ఉద్యోగుల బదిలీల కోసం ఇప్పటికే 140 మంది ఉద్యోగులు దరఖాస్తులు చేసుకొని వుండటంతో వీటిని జడ్పీ ఛైర్మన్, సిఇఓలు బుధవారం రాత్రి వరకు పరిశీలించి ఉద్యోగుల బదిలీలపై కసరత్తు చేస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫార్సు లు అధికంగా వుండటంతో ఒక స్థానం కోసం ఒకరి కంటే ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు సిఫార్సు లు చేయడంతో ఈ బదిలీలను పక్కాగా చేపట్టి పూర్తి చేయడానికి కొంత సమయం పట్టే అవకాశం కన్పిస్తోంది. ఇతర శాఖల్లో సైతం ఉద్యోగుల బదిలీలు గురువారం నాటికి పూర్తి అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## అడిగిన చోట ఇచ్చాను..
## శ్రద్ధగా పనిచేయండి : ఎస్పి పరమేశ్వర రెడ్డి



తిరుపతి క్రైం, మే 31, ప్రభాతవార్త

అడిగిన చోట ఇచ్చాను.. శ్రద్ధగా పనిచేయండని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లాల విభజన నేపథ్యంలో చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి తిరుపతి జిల్లాకు వచ్చిన సిబ్బందితో పాటు, ప్రస్తుతం తిరుపతి అర్బన్ పోలీస్ జిల్లాలో ఇది వరకు ఐదు సంవత్స రాలు నిండిన సిబ్బందికి జిల్లా ఎస్పి కార్యాలయంలో 268 మందికి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కౌన్సె లింగ్ ప్రక్రియ ద్వారా బదిలీలను జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి నిర్వహించారు. ముందుగా ఒక్కొక్కరితో ముఖాముఖిగా మాట్లాడి, కౌన్సి లింగ్ గురించి సిబ్బందికి వివరించి, తరువాత సిబ్బంది యొక్క ఆరోగ్య, కుటుంబ సమస్యలు, స్పౌస్ కేటగిరీలను పరిగణలోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్‌లో ఉన్న సదరు ఖాళీలను ప్రత్యక్షంగా స్క్రీన్ పై చూపి వారి కోరుకున్న చోటికి బదిలిచేసారు. ఈ ప్రక్రియ అంతా ఒకే పోలీస్ స్టేషన్ నందు ఐదు సంవత్స రాలు నిండిన వారికి మాత్రమే కౌన్సి లింగ్ ద్వారా బదిలీలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పి వెంకట్రావు, ఎఆ కిషోర్ కుమార్, జిల్లా పోలీస్ సిబ్బంది, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖర్ పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

శాంతిపురం, మే 31 ప్రభాతవార్త



రాష్ట్రంలోని మహిళల అభివృద్ధి తెదేపా అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు అనసూయ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహానాడులో చంద్రబాబు నాయుడు ఆరు పథకాలు ప్రకటిస్తే దానిపై మంత్రి రోజా చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. టూరిజం మంత్రిగా రోజా ఏం సాధించారని ప్రశ్నించారు. సమావేశంలో మహిళా నేతలు చంద్రకళ, సుగుణమ్మ, శ్యామలమ్మ, రూప తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విఆర్వో మృతి

వి.కోట, మే 31 ప్రభాతవార్త



మండలంలోని పెద్దభరిణేపల్లి విఆర్వోగా పనిచేస్తున్న పనిచేస్తున్న శంకర్ నారాయణ మంగళవారం రాత్రి దేవదొడ్డి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన శంకర్ నారాయణ ఓ వివాహంకు వెళ్లే నిమిత్తం టువీలర్‌లో బయలుదేరాడు. దేవదొడ్డి వద్ద అతివేగంగా వచ్చిన ఓ కారు ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కొలత్తూరు హరిజనవాడలో పౌరహక్కుల దినోత్సవ సభ

పెద్దపంజాణి, మే 31 ప్రభాతవార్త :



మండలంలోని కొలత్తూరు గ్రామ పంచాయతీలోని కొలత్తూరు హరిజన వాడలో బుధవారం తహశీల్దార్ హనుమంతు నాయక్ అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సభ ఏర్పాటుచేశారు. దళిత,గిరిజన వర్గాలకు సంబంధించిన వారు ఏదైన వివక్షతను ఎదుర్కోవడం జరుగుతుందా ఎవరైనా వీరిని కించపరిచేలా వ్యవహరిస్తున్నారా అని తహశీల్దార్ అడిగి తెలుసుకున్నారు. దీనిపై దళిత,గిరిజన వర్గాల ప్రజలు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు లేవని తాము సామరస్యంగానే ఉంటున్నట్లు పేర్కొన్నారు. తమపట్ల ఎలాంటి కులవివక్ష చూపడంలేదని గ్లాసుమార్పిడి వంటివి సాంఘిక దురాచారాలకు ఎవరూ పాల్పడడం లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ రవికుమార్, సచివాలయ సిబ్బంది, పంచాయతి కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్.

పెద్దపంజాణి మే31 ప్రభాతవార :

మండలంలోని మద్దలకుంట గ్రామంలో సుబ్బరాజు కుమారుడు అంజప్ప(35) అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అతన్ని అదుపులోకితీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అతని వద్ద నుండి 90ఎంఎల్ 20టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. రిమాండు నిమిత్తం పుంగనూరు కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

## నేడు డిప్యూటీ సిఎం గడప గడపకు మన ప్రభుత్వం

పాలసముద్రం, మే 31 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం ఆముదాల పంచాయతీ పరిధిలో గురువారం డిప్యూటీ సిఎం నారాయణస్వామి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నారని మండల వైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## కాపు కులస్తులకు కొడాలినాని క్షమాపణ చెప్పాలి

- తెదేపా జిల్లా నేత మంజునాథ్

కుప్పం, మే 31 ప్రభాతవార్త



రాష్ట్రంలో ఉన్న కాపు,బలిజ కులస్తులను నోటికొచ్చినట్లు దూషించిన మాజీ మంత్రి కొడాలి నాని కాపు కులస్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలుగుదేశం పార్టీ జిల్లా వాణిజ్య విభాగం నేత మంజునాథ్ డిమాండ్ చేశారు. కొడాలి నాని వంటి నేతలతో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని నోటికి వచ్చినట్లు మాట్లాడితే నాలుక కోస్తామని, రాష్ట్రం మొత్తం తిరగనిచ్చేది లేదన్నారు. 2024 ఎన్నికల్లో కాపు కులస్తుల బలం ఏంటో కొడాలినానికి చూపుతామని పేర్కొన్నారు. కాపు కులస్తులను నా కొడుకులు అని సంబోధించడం తగదని వెంటనే ఈ వ్యాఖ్యలు ఉపస oహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా శ్రీ తొట్లమ్మ ఆలయ కుంబాభిషేకం

కుప్పంరూరల్, మే 31 ప్రభాతవార్త



మండలంలోని మల్లానూరు పంచాయతీ మోట్లచేను గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ తొట్లమ్మ ఆలయ కుంబాభిషేకాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కలశస్థాపన నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్సీ భరత్, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ తదితరులు దర్శించుకున్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు రాష్ట్ర కాపు కార్పోరేషన్ ఛైర్మన్ కుప్పం పర్యటన

కుప్పంరూరల్, మే 31 ప్రభాతవార్త

రాష్ట్ర కాపు కార్పోరేషన్ ఛైర్మన్ అడప శేషు గురువారం కుప్పంలో పర్యటిస్తారని రాష్ట్ర ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, కుప్పం శ్రీ కృష్ణదేవరాయ బలిజ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.శివశంకర్ పేర్కొన్నారు. కుప్పంలో గురువారం ఉదయం బలిజ భవనం నిర్మాణంకు భూమిపూజ కార్యక్రమంలో ఛైర్మన్ పాల్గొంటారన్నారు. భవన నిర్మాణంకు కృషి చేసిన మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భవన శంకుస్థాపనకు ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, టిటిడి బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎంపిపి అశ్విని, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ తదితరులు హాజరవుతారన్నారు.

## మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలి - డిఆర్‌డిఎ పిడి

శాంతిపురం, మే 31 ప్రభాతవార్త



వెలుగు సంఘాల మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలని డిఆర్‌డిఎ పిడి తులసి సూచించారు. బుధవారం వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్ క్రాంతి పథకం, బ్యాంకు రుణాలు, స్త్రీ నిధి తదితర పథకాలతో రుణాలు పొందే మహిళలు ఆదాయ వృద్ధి మార్గాలు ఎంచుకోవాలన్నారు. చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటుచేసు ఒవాలన్నారు. అనంతరం సంఘమిత్రలకు ప్రశంసాపత్రాలు, మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో డిపిఎం నాగేశ్వరరావు, ఏసి చంద్రశేఖర్, ఎపిఎం గ్రీటా, సిసిలు గోపీనాథ్, కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ భరత్‌చే వేరుసెనగ విత్తనాల పంపిణీ

శాంతిపురం, మే 31 ప్రభాతవార్త



మండలంలోని సొన్నేగానిపల్లి, దండికుప్పం పంచాయతీల్లో బుధవారం రైతులకు ప్రభుత్వం అందించే రాయితీ వేరుసెనగ విత్తనాల పంపిణీని ఎమ్మెల్సీని భరత్ ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, మండల కన్వీనర్ దండపాణి, కృష్ణమూర్తి, విజయ్‌కుమార్, ఎఓ అప్పోజి, రైతులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రజాసమస్యల పరిష్కారానికే గడప గడపకు

- ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

కుప్పం, మే 31 ప్రభాతవార్త



ప్రజాసమస్యల పరిష్కారానికే సిఎం జగనన్న ఆదేశాలతో గడపగడపకు కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. బుధవారం రామకుప్పం మండలం బందార్లపల్లి పంచాయతీ బగళనత్తంలో గడపగడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సిఎం జగనన్నతోనే సాధ్యమన్నారు. పేదలకు వైకాపా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కలిగిన లబ్ధిని వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## విద్యార్థుల శాస్త్రీయ వైఖరులలో మార్పు అవసరం

కల్లూరు,మే31ప్రభాతవార్త



విద్యార్థుల శాస్త్రీయ వైకరులలో మార్పు అవసరమని కల్లూరు జిల్లా పరిసత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోకల తాతయ్య అన్నారు. బుధవారం పాఠశాలలో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారిచే 6 నుంచి 10వ తరగతుల విద్యార్తులకు యాక్టివిటీ బెస్ట్ సైన్స్ సమ్మర్ క్యాంపు 2023 కార్యక్రమం నిర్వహించారు. ఈవేసవి శిబిరంలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బోదకుడు భవాని శంకర్ విద్యార్థులను గ్రూపులుగా చేసి భౌతిక శాస్త్రములో కాంతి, ధ్వని, విద్యుత్తు విద్యుదయస్కాంతంనకు సంబందించిన వివిధ రకాల కృత్యాలను చేయించారు. ఈకృత్యాలలో కాంతి పరావర్తనం, తేలియాడే అయస్కాంతాలు విద్యార్థులను బాగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసిదుద్లఉ, రాజేంద్ర, దేవేంద్రనాథరెడ్డి, వెంకటరత్నం, సీఆర్పీలు పాల్గొన్నారు.

## మహిళాసాధికారతే తెదేపా లక్ష్యం

యర్రావారిపాలెం, మే31 ప్రబాతవార్త



స్త్రీ శక్తిని సంఘటితం చేసి మహిళా సాధికారతే లక్ష్యమని తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఎంపీటీసీ ఈశ్వరమ్మ అన్నారు. ఈసందర్భంగా యర్రావారిపాలెం లో జరిగినకార్యక్రమంలో ఆమె ఆద్వర్యంలో చంద్రబాబునాయుడు చిత్ర పటానికి పాలాభిసేకం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మహానాడులో మహిళల కోసంప్రత్యేకంగా పలుపథకాలుప్రకటించారన్నారు. మహిళలకు నెలకు 1500 వేయడం, తల్లికి వందనం పేరుతో ప్రతి తల్లిబిడ్డకు రూ.15వేలు వేస్తాననడం, దీపం పథకం కింద 3 గ్యాస్‌సిలెండర్లను ఉచితంగా ఇస్తానని చెప్పడం మహిళలకుఎంతో మేలుచేసేవన్నారు. బీసీలకు ప్రత్యేక చట్టం ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి వంటి పథకాలు అమలు చేస్తాననడం గొప్ప విషయమని ఆమె చెప్పారు.

## పిఇఎస్ వైద్య కళాశాల డిపిఎల్ క్రికెట్ టోర్నీ విజేత విష్ణుస్ కింగ్ జట్టు

కుప్పం, మే 31 ప్రభాతవార్త



కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో ఈనెల 15నుంచి మొదలైన డాక్టర్స్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ (డిపిఎల్) టోర్నీ బుధవారం ముగిసింది. వైద్య విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు, నాన్ టీచింగ్ స్టాఫ్ జట్ల మధ్య ఈ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో విష్ణుస్ కింగ్ జట్టు సాగర్స్ స్ట్రైకర్స్ జట్టుపై గెలిచి విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో బెస్ట్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా శంకర్, మ్యాన్ ఆఫ్‌ది టోర్నీగా భరత్‌రామ్, ఉత్తమ బౌలర్‌గా శ్రవణ్, ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా భరత్‌రామ్ నిలిచారు. విజేతలకు పిఇఎస్ మెడికల్ కాలేజ్ డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ఆర్ కృష్ణారావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సిబి పాటిల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, స్టూడెంట్స్ వెల్ఫేర్ అధికారి, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## నిబంధనలు తూచ్..

కోట, మే 31 ప్రభాతవార్త



నిర్మాణ రంగంలో కీలకమైన ఇటుకలకు గిరాకీ పెరగడంతో బట్టీలు కూడా విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. కోట మండలంలో తిమ్మానాయుడుపాలెం, రంగన్నగుంట, వెంకన్నపాలెం సమీపంలో ఇటుక బట్టీలు వెలిశాయి. నివాస ప్రాంతాలు, రహదారులకు దూరంగా ఇటుకలు తయారు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ వ్యాపారులు వాటిని తుంగలో తొక్కుతున్నారు. అధికారులు కూడా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో పలు గ్రామాల్లో నిబంధనలకు ఇటుక బట్టీలు వెలుస్తున్నాయి. ఇటుకల తయారీకి రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలితో పాటు స్థానిక పంచాయతీ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. భూమి వినియోగిస్తున్నందుకు ప్రభుత్వానికి నిర్ణీత రుసుము చెల్లించాలి. కానీ బట్టీల నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. దీంతో స్థానిక సంస్థల ఆదాయినిక గండి పడుతోంది. ఇటుక బట్టీలు గ్రామానికి 0.8 కిలోమీటరు దూరంలో ఉండాలని కేంద్ర పర్యావరణ శాఖ పేర్కొంది. బట్టీలన్నీ ఒకేచోట ఏర్పడితే వాయు కాలుష్యం పెరిగే ప్రమాదముందన్న కారణంతో కనీసం కిలోమీటరు దూరం ఉండాలని షరతు విధించింది. ఇటుకలను కాల్చడానికి టైరు, ప్లాస్టిక్ వంటి ప్రమాదకర వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదని స్పష్టం చేసింది. బట్టీల్లో పనిచేసే కార్మికులకు నిర్వాహకులు కనీసం బీమా కూడా కల్పించడం లేదు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే అధికారులు నిబంధనల పేరుతో హడావుడి చేస్తున్నారు. ముందస్తు చర్యలు తీసుకుంటే ఇబ్బందులు తలెత్తవని పలువురు సూచిస్తున్నారు. అధికారులు ఇటుక బట్టీలను అక్రమంగా నిర్వహిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## తమ్మినేనికి రాజకీయ భిక్ష పెట్టింది టిడిపి


కోట, మే 31 ప్రభాతవార్త

శాసన సభాపతి తమ్మినేని సీతారామ్‌కు రాజకీయ భిక్ష పెట్టింది తెలుగుదేశం పార్టీ అనే విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలని కోట పట్టణ టిడిపి అధ్యక్షుడు షేక్ షంషుద్దిన్ అన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడికి భద్రత తొలగించాలని తమ్మినేని వ్యాఖ్యానించడం అర్థరహితమన్నారు. ఆయన మాటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్‌కు భరోసా ఇస్తూ తెలుగుదేశం పార్టీ మహానాడులో చంద్రబాబునాయుడు ప్రకటించిన మేనిఫెస్టోలో అద్భుతమైన పథకాలు ఉన్నాయని చెప్పారు. మహిళల స్వావలంబనకుపెద్దపీట వేశారని చెప్పారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి చేయలేదని విమర్శించారురానున్నఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడతారని ధీమా వ్యక్తం చేశారు.

## అర్జీదారుడు సంతృప్తి చెందేలా స్పందనలో సమస్యలకు పరిష్కరించాలి

ఆర్డిఓ కిరణ్ కుమార్

గూడూరు, మే 31, ప్రభాతవార్త



స్పందనకు వచ్చిన అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదామన్నారు. 1902 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసిందని దీనికి వచ్చిన ఫిర్యాదులపై పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆర్డీవో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాంకు వచ్చిన ఫిర్యాదులపై పలు శాఖల అధికారులు ఫిర్యాదుదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిర్యాది దారులు తమ సమస్యలను ఆర్డిఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలపై అధికారులతో చర్చించారు. ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు వేగవంతంగా సమస్యలు పరిష్కారం అయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం 1902 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసిందని ప్రజలు ఈ నెంబర్‌కి ఫోన్ చేసి వారి సమస్యలను తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, కమిషనర్ సాయినాథ్, డివిజన్ లోని తహశీల్దార్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తడలో నేడు జిల్లాస్థాయి రైతు భరోసా సమావేశం

తడ, మే 31 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రైతు భరోసా బటన్ నొక్కే కార్యక్రమం జిల్లాస్థాయిలలోను ఉన్నతాధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాకు సంబంధించి తడలో అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులతో ఉన్నతాధికారులు సమావేశమై రైతు భరోసా గురించి జిల్లా స్థాయి అభివృద్ధి వివరిస్తారు. సాధారణంగా జిల్లా కేంద్రాల్లో జరిగే ఈ సమావేశాలు రైతుల ముందుకే తీసుకొచ్చే బృహత్తర కార్యక్రమంగా దీన్ని పేర్కొంటున్నారు. గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 2023-24 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత రైతు భరోసా నిధులు విడుదల చేస్తారు. అదే సమయంలో తిరుపతి జిల్లా పరిధిలోని తడలో స్థానిక బోడిలింగాలపాడు వద్ద ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ఒక హోటల్‌లో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డిస్ట్రిక్ట్ వ్యవసాయ అధికారి ఎస్.ప్రసాదరావు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు రైతు భరోసా లబ్ధిదారులతో మాట్లాడారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి రైతులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.

## సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

- మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట, మే 31 ప్రభాతవార్త



రాష్ట్రంలో సంక్షేమాన్ని ప్రణాళి కాబద్ధంగా అమలు చేయాలంటే చంద్రబాబునాయుడికే సాధ్యమవు తుందని మాజీ ఎంపి, తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాడు చరిత్రలో లేని విధంగా ప్రభంజనంలాగా జరిగిందని, మహానాడు వేదికగా రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో పథకాలను చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. అధికార పక్షం ఆరోపిస్తున్నట్లు ఇటువంటి పథకాలు అమలు చేయలేరని విష ప్రచారం చేస్తున్నారని, వాటన్నింటినీ అమలు చేసి ప్రజలకు చేరువ చేయగల సత్తా చంద్రబాబునాయుడికి మాత్రమే ఉందని ఆయన తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. ఇసుక, గ్రావెల్, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, ఇవన్నీ ఎవరి కనుసన్నల్లో జరుగుతున్నాయో అందరికీ తెలియాలని అధికారులు ఈ విషయంలో దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని నెలవల చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఆకుతోట రమేష్, చిట్టేడి పెరుమాళ్లు, మెస్ రమణయ్య, ఎస్ఎన్ మునిరాజా, మాధవనాయుడు, శివ, చీమలదిన్నె రమణయ్య, కొలగాని మార్కండేయులు, మీజూరు వెంకటేశ్వర్లు, గండవరం రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదు

-మాజి ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, మే 31 ప్రభాతవార్త



వైసిపి ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని మాజి ఎంల్ఎ కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. బుదవారం ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయక పోగ కోట్లాది రూపాయల అప్పులు చేసినట్లు ఆరోపించారు. రాష్ట్రం అవినీతి మయంగా మారినట్లు తెలిపారు .సిఎం జగన్ మోహన్ రెడ్డి అవినీతి సంపాదనలో టాప్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇసుక, మద్యం, ఎర్రచందనం వాటిద్వార నాలుగు లక్షల రూపాయలు సందాన ఆర్జించినట్లు తెలిపారు. టిడిపి మ్యానిపెస్టోని విమర్శించే అర్హత లేదన్నారు. కాగ 2024 ఎన్నికల్లో టిడిపి అదికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజి ఎఎంసి ఛైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు, నాయకులు గంగాదర్, చంద్రమౌళిరెడ్డి, సత్యనారాయణ, విశ్వనాదం, కేవికె ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపు మనప్రభుత్వంకు అనూహ్యస్పందన

-జిల్లా వైసిపి అద్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

బాలాయపల్లి మే 31 ప్రబాతవార్త



గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమానికి గ్రామాల్లో అనూహ్యస్పందన లభిస్తున్నట్లు వైసిపి జిల్లా అద్యక్షులు, కమ్యూనిటి బోర్డు డవలప్ మెంట్ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుదవారం డక్కిలి, వెంపటివారి పల్లి.అట్లశిద్దవరం గ్రామాలలో ఆయన గడన గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డికి హారతులు పట్టి, పూలుచల్లుతూ ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్ళిప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పదకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడు తూ సిఎం జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పదకాలను నేరుగ బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపిపి గోను రాజశేఖర్, ఎంపిడిఒ కోటేశ్వరరావు, నాయకులుశ్రీనివాసులురెడ్డి ఉన్నారు,

## రైతు భరోసాతో 4500 కుటుంబాలకు లబ్ధి

కోట, మే 31 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కార్యక్రమాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభిస్తారని కోట మండల వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ తిరుపతి జిల్లా తడ వద్ద రైతు భరోసా కార్యక్రమంలో జిల్లా అధికార యంత్రాంగం పాల్గొని రైతుల బ్యాంకుల ఖాతాల్లోకి బటన్ నొక్కి నగదు జమ చేస్తారని తెలిపారు. ఒక్కొక్క రైతుకు రూ.5,500 చొప్పున వారి ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. మండలంలో 4500 మంది రైతులకు రైతు భరోసా లభిస్తుందని తెలిపారు.

## లోన్ యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### నాయుడుపేట సిఐ వైవి సోమయ్య

ఓజిలి, మే 31, ప్రభాతవార్త

వాట్సప్ లోన్ యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాయుడుపేట సిఐ వైవి సోమయ్య అన్నారు. బుధవారం ఓజిలి ఆటోస్టాండ్‌లో ఆటో డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాల్లో ప్రజలు ముఖ్యంగా యువతను దోచుకుంటున్నారు. చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌కు వచ్చే పలు రకాల మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా లేకపోతే భారీగా సొమ్ములను పోగొట్టుకునే పరిస్థితి ఉందని సైబర్ నేరగాళ్ళ విషయంలో అప్రమత్తంగా ఉంటూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వారి వలలో చిక్కుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సిఐ వైవి సోమయ్య అన్నారు. అపరిచితులు సోషల్ మీడియాలో పంపే రిక్వెస్ట్‌లకు స్పందించకుండా ఉండాలని, మీ కెవైసి వివరాలను అప్‌డేట్ చేస్తున్నట్లు నటిస్తూ ఫోన్ చేయడం, మీకు ఉద్యోగం వచ్చిందంటూ ఫోన్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్ల పలు మెసేజులు పంపుతారని ఆన్‌లైన్ కొనుగోళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. మన అకౌంట్‌లో సైబర్ నేరగాడు చూపించిన నగదు జమ అయినట్లు ఆయన సూచించారు. మన అకౌంట్‌లో సైబర్ నేరగాడు చూపించిన నగదు జమ అయినట్లు చూపిస్తుంది కాని అవి అకౌంట్‌లోకి రావు మన ఆశను ఆసరా చేసుకుని మన సొమ్ము మొత్తం లాగేసుకుంటారు. సైబర్ నేరగాళ్ళు. అందువల్ల ఎటువంటి లింక్‌లు క్లిక్ చేయరాదని ఆయన అన్నారు. క్రెడిట్ కార్డు ఆఫర్లతో జాగ్రత్త అవసరం మీ క్రెడిట్ కార్డు బ్లాక్ అయిందని లేదా మీ లిమిట్ డబల్ చేస్తామని కాల్స్ వస్తే నమ్మవద్దని సూచించారు.



## కోలాహలంగా గంగజాతర వేడుకలు

పుత్తూరురూరల్, మే 31 ప్రభాతవార్త:

పుత్తూరు మున్సిపల్ పరిధిలోని కట్ట కింద రామకృష్ణాపురం గ్రామంలో గంగజాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి అమ్మవారిని బంకమట్టితో తయారు చేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి విద్యుత్ దీపాలంకరణతో వీధుల్లో ఊరేగించారు. బుధవారం ఉదయం గంగమ్మ మండపం వద్ద పిండి దీపాలు పొర్లు దండాలు పెట్టి పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని కుంబాలు వేసి నైవేద్యంగా అమ్మవారి సమర్పించారు. రాత్రి మేళతాళాలతో ఊరేగించి అమ్మవారిని నిమజ్జనం చేశారు.

## సాయిబాబా మందిర ప్రారంభోత్సంలో పవిత్రారెడ్డి

తొట్టంబేడు, మే 31 ప్రభాతవార్త



మండలంలోని రాంబట్లపల్లి గ్రామంలోని సాయి బాబా మందిరంలో చిత్రపటం ప్రతిష్ట కార్యక్రమంలో ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి తనయ బియ్యపుపవిత్రారెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమెకు మాజీ సర్పంచ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కె.మహదేవరెడ్డి, గ్రామస్తులు స్వాగతం పలికారు. ఆలయంలో వెలసిన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుని దర్శనం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాలు భక్తిభావాన్ని నింపుతాయని ప్రతి ఒక్కరు భక్తిభావంతో ఉండాలన్నారు. అనంతరం పవిత్రారెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు మణి, సుధాకర్‌నాయుడు, మోహన్, చెంచురామిరెడ్డి, పాపయ్య, రఘునాథ్‌రెడ్డి, బాబుజి, వెంకటసుబ్బయ్య, గున్నయ్య, శంకరయ్య, మల్లి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌జైలును ఆకస్మికంగా పరిశీలించిన జడ్జి

శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త



జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని కొత్తపేటలో ఉన్న సబ్‌జైలును అడిషనల్ జూనియర్‌సివిల్‌జడ్జి కృష్ణ ప్రియ బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందార్భంగా ఆమె సబ్‌జైలు పరిసర ప్రాంతాలు, వసతిగదులు, స్టాక్‌రూం, భోజనశాల గదులను పరిశీలించి ఖైదీలకు పెట్టే భోజనం గురించి వివరాలు తెలుసుకోవడంతో పాటు వారి ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్నారు. న్యాయపరమైన సమస్యలు ఏవైనా ఉంటే తమకు తెలియజేస్తే చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. సమస్యలపై వినతఆపత్రం ఇస్తే వెంటనే తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్బన్ హెల్త్‌సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ

శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త



వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా గజేంద్రనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్లు జావీద్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా టొబాకో వాడకం వల్ల ఊపిరితిత్తుల్లో క్యాన్సర్ రావడం, శ్వాసకోశ వ్యాధులు రావడం దాని వల్ల ప్రాణాంతకమైన పరిస్థితులు వచ్చి చివరకు ప్రాణాలు పోయే పరిస్థితి చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ పొగాకుని సిగరెట్లు మానుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు మరియు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## అంకాళమ్మ కుంభాభిషేకంలో పవిత్రారెడ్డి

తొట్టంబేడు, మే 31 ప్రభాతవార్త



మండలంలోని లింగమనాయుడుపల్లి గ్రామం లో నూతనంగా నిర్మించిన అంకాళమ్మ తల్లి ఆలయ మహాకుంభాభిషేకంలో ఎంఎల్ఏ తనయ బియ్యపుపవిత్రాపాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా మండల ఇన్‌ఛార్జి పవిత్రారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల కుంభాభిషేకాలు, జాతరలు మన తెలుగుసంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలని తెలిపారు. అమ్మవారికి పవిత్రారెడ్డిస్వయంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెను దుశ్శాలువతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లునాయుడు, జివినాయుడు, శ్రీను, రమేష్, సురేష్, సుబ్బయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## దళారి అవతారమెత్తిన ఉచిత సేవకునికి మందలింపు

శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా దళారులకు భయం లేకుండా పోతుంది. ఆలయంలో ఏదో రాజకీయ నాయకుని సిపార్సుతో ఉచిత సేవకులుగా చేరటం ఇక్కడ దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను మభ్యపెట్టి దోచుకోవటం పరిపాటిగా మారింది,ఈ నేపథ్యంలో బుధవారం ఆలయంలో హుండీల లెక్కింపు జరుగుతుంది. కన్నప్ప అనే ఉచిత సేవకుడు పది మందిభక్తులను మభ్యపెట్టి రూ. 2వేలకు ఒప్పందం కుదర్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇఓ సాగర్‌బాబు ఆతన్ని పట్టుకున్నాడు. సిసి కెమెరాల్లో గమనించిన ఇఓ సాగర్‌బాబువెంటనే సిబ్బందికి సమాచారం అందించి ఆతని పట్టుకొని మందలించి వదలిపెట్టారు. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా రాజకీయ నాయకుల సిఫార్సులతో యువకులు భయం లేకుండా వ్యవహరిస్తున్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందించే బాధ్యత అధికారులది

ఎంఎల్ఏ బియ్యపుమధుసూధనరెడ్డి

శ్రీకాళహస్తిరూరల్, మే 31 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిరుపేదల సంక్షేమానికి చేపట్టిన పథకాల ఫలాలు అందించాల్సిన బాధ్యత అధికారులదే అని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు.బుధవారం శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం సచివాలయ పరిధిలోని బిసి కాలనీల్లో ఆయన 'జగనన్నే మా నమ్మకం' పథకంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల తీరును అడిగి తెలుసు కున్నారు.అంతేకాక ప్రతి గడపకు వెళ్ళి జగనన్న మీ కోసం రూపొందించిన పథకాల ఫలాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. భారత దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేపట్టని రీతిలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి రూ.5నుంచి పది లక్షలు లబ్ది పొందుతున్నారని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాల్లో జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ జయరాంరెడ్డి, ఎంపిటిసి హరి, మునిరాజా, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్, ప్రభాస్, సురేష్‌రెడ్డి, బుర్ర వెంకటరెడ్డి,రజనీకాంత్, చంద్రబాబు, ప్రసాద్,కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల అసంతృప్తిని తెలియజేయడానికే రిలేదీక్షలు

శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులందరి అసంతృప్తిని తెలియజేసి ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఇందుకోసంఉద్యమించాల్సిన సమయం వచ్చిందని ఏపిజిఏ నేతలు ప్రభుత్వ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏపిజిఈఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒక్కరోజు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ కాంటాక్టు , పెన్షనర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెట్టుకున్న కోటి ఆశలను నీరుగార్చిందని వాపోయారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికపరమైన అరియర్స్ విడుదల చేయకపోయినా చప్పుడు చేయకుండా మిన్నకున్న మనీ హుకుం జారీ చేస్తోందని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఐఆర్ ప్రకటించిన దానికంటే తక్కువ ఫిట్‌మెంట్ ఇచ్చిన ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వ చరిత్రలో నిలచిపోతుందని ఎద్దేవాచేశారు. అయితే రాజమహేంద్రవరంలో వేలాది ఉద్యోగుల సాక్షిగా ఉద్యమమే శరణ్యమని తీర్మానించిందని గుర్తుచేశారు. ఇందుకు ఏపిజిఈఏతో పాటు అనుబంధ సంఘాల కూడా ఐక్యవేదిక ద్వారా పోరాటాలతోనే ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు సాధించవచ్చన్నారు. సిపిఎస్‌ను రద్దు పరచి ఓపిఎస్ పునరుద్దరించాలని, ప్రతినెల ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు చెల్లించేలా చట్టం చేయాలని, 1993 నవంబర్ 25వ తేదీ కంటే ముందు నియమితులైన కాంటాక్టు ఉద్యోగుల రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన వేతనాలు ఇవ్వాలని, 11వ పిఆర్సీ అమల్లో ప్రభుత్వం భారంగా ఉద్యోగులు దాచుకున్న సొమ్ములకు భద్రత కల్పించాలని పదవీ విరమణ ఉద్యోగులకు పదవీవిరమణ రోజున అన్ని ఆర్థిక ప్రయోజనాలు విడుదలచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు శాంతిదుర్గ, కార్యదర్శి శ్రీనాథ్, ట్రెజరర్ బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మిపతి, జిల్లా అధ్యక్షులు వైజెపి ప్రసాద్‌రెడ్డి, ఏపి సిపి సర్వీసెస్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పూర్ణం తదితరులు పాల్గొనగా కార్యక్రమానికి ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, ఏపి సిపిఎస్ యుఎస్ జిల్లాఅధ్యక్షులు రేగంటిదేవానంద్,, పివిసుబ్బారెడ్డి, పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు వెంకయ్య, సుధాకర్, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మోసపూరిత మానిఫెస్టో చీటింగ్ చార్జ్ షీట్

ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



తిరుపతి నగరం, మే 31, ప్రభాతవార్త

తేదేపా మహానాడులో తన కార్యకర్తలకు 10 తప్పుపట్టిన హామీల తుపాకీలిచ్చి యుద్ధ రంగానికి పంపిందని, అబద్ధాల చీటింగ్ చార్జ్ షీట్‌ను వదిలిందని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం విమర్శించారు. రష్ హాస్పిటల్‌లోని తన కార్యాలయంలో మాధ్యమాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తేదేపా ఆరోపణపైన నేరాలు, గోరాలు, విధ్వంసాలు, విద్వేసాలు, దోపిడిలు, లూటీలు తేదేపా పాలనకు అతికినట్టు సరిపోతాయని ఆయన వివరించారు. బ్రిటిష్ వాడి జలియన్ వాలాబాగ్‌ను మరపించిన మారణకాండ బషీర్ బాగ్ మరణ మృదంగాలు, గోరాలు కాదా అని నిలదీసారు. కారంచెడు దళిత హత్యలు, వంగవీటి రంగా హత్యలు, వనజాక్షిపై దాడులు నేరాలు కాదా అని ప్రశ్నించారు. ఆదర్శంగా ఉండాల్సిన ముఖ్యమంత్రే నదీ పరివాహన ప్రాంతంలో అక్రమంగా కట్టిన భవనాన్ని కూల్చితేనే విధ్వంసము అని అడిపోసుకుంటున్నారు. 10 మందైనా కనండి, వారిని ప్రజలు కట్టిన పన్నులతో నేను సాకుతానని అనడము విధ్వంసము కాదా అని ప్రశ్నించారు. యంత్రాలవల్ల కోట్లాది కూలీలు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వల్ల కోట్లాది డ్రైవర్, సాఫ్ట్‌వేరు, సర్వీసు సెక్టారులోని ఉద్యోగులు వీధిన పడతారని మేధావులు హెచ్చరిస్తుంటే కనండి ఇంకా కనండి ఎంతమందైనా కనండి అందరిని నేను సాకుతాను అనడం హిరోషిమా అణు దాడి కంటే పెద్ద విధ్వంసం సృష్టిస్తుందని హెచ్చరించారు. పోలవరం నిర్మిస్తానని కేంద్రం అన్నప్పటికీ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేపట్టింది. దాంతో అస్మదీయుల బీరువాలు నింపడాన్ని నిలుపు దోపిడి అంటారన్నారు. అలాగే ఎస్సీ బీసీ కార్పొరేషన్ ద్వారా చేసే పరికరాలు, కార్లు పంపిణీ ద్వారా బ్రోకర్లు కోట్ల రూపాయిలు కమిషన్లు కొడుతున్నారన్నారు. నీరు చెట్టు పథకం ద్వారా జన్మభూమి, కమిటీలు వేలాది కోట్ల రూపాయిలు కాచేయడాన్ని పట్టపగటి దోపిడి అంటారని తీవ్రంగా దుయ్యబట్టారు.

## జీతాల కోసం కార్మికుల ధర్నా



పుత్తూరు, మే 31 ప్రభాతవార్త :

పెండింగ్‌లో వున్న జీతాల కోసం పలువురు కార్మికులు బుధవారం ఉదయం స్థానిక చిదా స్పిన్నింగ్ మిల్లు గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు జీతాల బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీతాల విషయమై వచ్చే నెల 12వ తేదీన కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వద్ద జరగనున్న సమావేశంలో మిల్లు ఎంతకు అమ్మారు, కార్మికులకు ఇవ్వాల్సిన నగదు విషయమై స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం ప్రకటించాలన్నారు. జీతాల కోసం తమ న్యాయ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఏలుమలై, రాజేంద్ర, రవిచంద్ర, రామ్మూర్తి, గోవిందరాజు, రఘుపతి, నాగూరు, మాసిలామణి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

పుత్తూరు, మే 31 ప్రభాతవార్త :



టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో జూన్ రెండో తేదీన తిరుపతి పద్మావతి పురంలోని ఎల్.వి.కల్యాణమండపం లో ఉదయం తొమ్మిది గంటలకు అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం జరుగుతుందని టిఎన్‌టియుసి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్లలో కార్మికులు పడుతున్న ఇబ్బందులపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. అందువల్ల చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని టిఎన్‌టియుసి రాష్ట్ర, పార్లమెంట్, అసెంబ్లీ కమిటీ సభ్యులు సమావేశానికి హాజరవ్వాలని కోరారు. అలాగే తమ పరిధిలోని వివిధ యూనియన్లను కూడా సమావేశానికి ఆహ్వానించాలని తెలిపారు.

## పని వేళల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో వుండాలి

కమిషనర్ హరిత



తిరుపతి కార్పొరేషన్, మే 31, ప్రభాతవార్త

పనివేళల్లో సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోని సరోజినీదేవి రోడ్డులో గల 38వ వార్డు సచివాలయంను బుధవారం మధ్యాహ్నం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. నలుగురు కార్యదర్శులు మాత్రమే ఉండడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. పని వేళల్లో కార్యదర్శులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఫీల్డ్ ఇన్స్పెక్షన్‌కు వెళితే ఖచ్చితంగా మూవ్మెంట్ రిజిస్టర్ నమోదు చేయాలని, లేకుంటే గైర్హాజరుగా నమోదు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు. కార్యదర్శులుఅందరూప్రతిరోజూఖచ్చితంగాయూనిఫాంధరించిరావాలనితప్పక హాజరు నమోదు చేయాలన్నారు.

## ముగింపు దశకు ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు

-పర్యవేక్షించిన ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డా॥వై.ప్రవీణ్



తిరుపతి ప్రెస్‌క్లబ్,మే 31 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిబిరాలు ముగింపు దశకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం క్రీడా శిక్షణ శిబిరాలలో జరుగుతున్న శిక్షణను శాప్ చీఫ్ కోచ్ సయ్యద్‌తో పాటు తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డా॥యలమంచిలి ప్రవీణ్,కార్యదర్శి శ్రీధర్‌లు పర్యవేక్షించారు.పర్యటనలో భాగంగా భైరవపట్టులోని 'కెన్ భూ కాయ్' కరాటే స్కూల్‌ను సందర్శించారు.ఈ శిబిరం నుండి అనేక మంది క్రీడాకారులు రాష్ట్ర,జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వారిని అభినందించి వారికి పతకాలు బహూకరించి శిక్షకుడు రత్నాకర్‌ను అభినందించారు.అలాగే తారకరామ స్టేడియంలో వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్న అథ్లెటిక్స్ క్రీడాకారులను అభినందించారు.

## శ్రీనివాస సేతు పిల్లర్లపై పోస్టర్లు వేసిన జేఆర్ ఫాన్సీ షాప్ సీజ్



తిరుపతి కార్పొరేషన్, మే 31, ప్రభాతవార్త

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ పిల్లర్లపై అనుమతి లేకుండా స్టిక్కర్లు వేసి అపరిశుభ్రంగా చేసిన జేఆర్ ఫాన్సీ షాప్‌ను నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాల మేరకు సీజ్ చేసినట్టు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి షణ్ముగంతెలిపారు.నగరాన్నిపరిశుభ్రంగాఉంచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న తరుణంలో లీలామహల్ కూడలి నందు పిల్లర్లపై పోస్టర్లు వేయడం నేరమన్నారు. శుభ్రంగా ఉన్న పిల్లర్లపై పోస్టర్లు వేసి అపరిశుభ్రం చేసినందుకు, ఎటువంటి అనుమతులు లేకపోవడం వలన కార్యాలయం సీజ్ చేశామన్నారు. నగరంలో ఎక్కడైనా ఎవరైనా అనుమతులు లేకుండా పోస్టర్లు అతి కించ గాఫ్లెక్సి లుఏర్పాటుచేసినకఠినచర్యలుతీసుకుంటామని,జరిమానాలువిధిస్తామనికమిషనర్‌హెచ్చరించారు.

## శివయ్య సన్నిధిలో బిజెపి నాయకుడు



శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త

బిజెపి గుజరాత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపి, రఘునాధ్‌పాటిల్ కుటుంబసభ్యులతో బుధవారం శ్రీకాళహస్తీ శ్వరుని దర్శనంకు వచ్చారు.వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ఇఓ సాగర్‌బాబు దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనం అందించారు.తరువాత అతిధికి ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి దారుశిల్పాన్ని బహూకరించారు. స్వాగతం పలికిన వారిలో ఆర్‌డిఓ కెయస్ రామారావు,ఇఓ సాగర్‌బాబు, ఎఇఓ సతీష్‌మాలిక్, పిఆర్ఓ వెంకటస్వామి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం తదితరులు పర్యవేకించారు.

## గుర్తు తెలియని వాహనం డీకొని వృద్ధురాలు మృతి

శ్రీకాళహస్తి రూరల్, మే 31 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఈంద్రపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన వృద్ధ మహిళ మృతి చెందింది. సంఘటనకు సంబంధించి రూరల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వివరణ ఇచ్చారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈంద్రపల్లికి చెందిన బండ్ల లక్ష్మమ్మ(70) తన అనారోగ్యంతో సమీపంలోని ఎంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు.ఆసుపత్రికి బయలు దేరిన లక్ష్మమ్మ ఎంతకూ తిరిగి రాకపోవటంతో కుటుంబసభ్యులు వెతుక్కొగా ఆమెరోడ్డు మీద మృతదేహంగా పడి ఉండటంతో శోకంలో మునిగిపోయారు.

## పొగాకు నివారణ దినోత్సవంపై ర్యాలీ



.తొట్టంబేడు, మే 31 ప్రభాతవార్త

తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మనకు 'ఆహారం అవసరం-పొగాకు కాదు' అనే నినాదంతో ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సంద్భంగా వైద్యాదికారులు డాక్టర్‌లహరి,డాక్టర్‌సాయిపూజఆధ్వర్యంలోర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ పొగాకు ఏ రూపంలో వినియోగిస్తున్నా ఆరోగ్యానికి హానికరమే అని డాక్టర్లు తెలిపారు. బీటి, చుట్ట, సిగరెట్, హుక్కా, ఖైనీ, గుట్కా, మావా, జర్దా, హాన్స్ అన్ని హానికరమే అని తెలిపారు. మే నెల 31వ తేదీన ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించామన్నారు.వీటి వల్ల ఊపిరితిత్తులు వ్యాధులైన ఆస్మా, క్షయ, క్యాన్సర్ వంటివి కలుగవచ్చని హెల్త్‌సూపర్‌వైజర్ కామరాజు తెలిపారు. గుండెకు సంబందించిన రక్తనాళాలు గట్టిగా తయారై రక్తపోటు, గుండెపోటు రావచ్చని మెదడులోని రక్తనాళాలు చిట్లి పక్షవాతం, నరాల బహీనతతో పాటు సంతానోత్పత్తి సామర్ధ్యం కూడా తగ్గవచ్చని తెలిపారు. ఈ అలవాట్లు ఉన్న వారందరు మానివేస్తే ఆరోగ్యసంరక్షణ చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ సంపూర్ణర, భారతీ, ఎంఎల్‌హెచ్‌సిలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మహిళల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం



వడమాలపేట, మే 31 ప్రభాతవార్త:

మహిళల సంక్షేమాభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. టీడీపీ మహానాడులో విడుదల చేసిన మేనిఫెస్టోలో మహిళల కోసం ప్రకటించిన సంక్షేమ పథకాలపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం వడమాలపేటలో మహిళలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతే తెలుగుదేశం పార్టీ ఏ జెండా అని మహానాడులో చంద్రబాబు ప్రకటించిన పథకాలే అందుకు నిదర్శనమన్నారు. చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి యాళ్ళ లక్ష్మీప్రసన్న, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు ధనలక్ష్మి, నగరినియోజకవర్గమహిళాప్రధానకార్యదర్శినాగరత్న,చిత్తూరుపార్లమెంట్అధికారప్రతినిధి ధనంజయ నాయుడు, శేషాద్రి యాదవ్, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, మురళి, లోకనాథం, మహిళలు పాల్గొన్నారు.

## పొగాకు ఆరోగ్యానికి హానికరం

వడమాలపేట, మే 31 ప్రభాతవార్త:



పొగాకును వాడడం వల్ల రోగాలను కొని తెచ్చుకోవడమే అని సామాజిక ఆరోగ్యధికారి పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. పొగాకు వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, కార్యకర్తలు బుధవారం అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పొగాకు వినియోగించడం వల్ల ప్రతి సంవత్సరం ప్రపంచంలో 8 మిలియన్ల మంది ప్రజలు చనిపోతున్నారని తెలిపారు. పొగాకు వల్ల నోటి క్యాన్సర్, గుండె, శ్వాసకోస సంబంధిత జబ్బులు సంభవిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భానురేఖ, సామాజిక ఆరోగ్యధికారి పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, మంజుల, గౌరి, మరియమ్మ, ఉష, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## నాలుగేళ్ల జగన్ పాలనలో అంతా దోచుకోవడమే!

-అభివృద్ధి నిల్..అరాచకం ఫుల్ -జనసేన పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి ధ్వజం

తిరుపతి ప్రెస్‌క్లబ్,మే 31 ప్రభాతవార్త:



రాష్ట్రంలో ఈ నాలుగేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలన మొత్తం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ల్యాండ్, శాండ్, వైన్, మైన్, రెడ్‌శాండిల్ ఇలా అన్నింటిలో 'దోచేయ్' అన్న సిద్ధాంతంతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని జనసేన పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి మండిపడ్డారు.బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన జనసైనికులతో కలిసి 'దోచేయ్' అన్న టైటిల్‌తో,సిఎం జగన్ ఫోటోతో ముద్రించిన పోస్టర్‌ను మీడియా ముందు ప్రదర్శించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి గుండు సున్నా అన్నారు.రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైసిపి ఎమ్మెల్యేలు,మంత్రులు,ఎంపిలు,నాయకులు,ఆఖరికి చోటా నాయకులు సైతం ఎక్కడ అవకాశం ఉన్నా దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. రాబోయే 2024 ఎన్నికల్లో పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి,తన స్వంత డబ్బులు కౌలు రైతులకు,పేదలకు ఆర్థిక సాయమందిస్తున్న పవన్‌కళ్యాణ్‌ను సిఎం చేయడానికి ఎప్పుడెప్పుడు ఎలక్షన్లు వస్తాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈసమావేశంలోజనసైనికులురాజేష్‌యాదవ్, డా॥బాబు, బాబ్జీ, హేమకుమార్, మనోజ్, కిషోర్, మణి, చరణ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా "పిడసల గంగమ్మ జాతర"

"మంచు మోహన్‌బాబుకు" ప్రత్యేక ఆహ్వానం

రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి



చంద్రగిరి, మే 31 ప్రభాతవార్త:

పిడసల గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి పంచాయతీలో 52 ఏళ్ళ అనంతరం పిడసల గంగమ్మ జాతర నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, కొటాల పద్మజ దంపతులు బుధవారం గ్రామస్థులతో కలసి శ్రీవిద్యానికేతన్ విద్యా సంస్థల అధినేత మంచు మోహన్‌బాబును ప్రత్యేకంగా జాతరకు ఆహ్వానించారు. పంచాయతీ ప్రజల ఆహ్వానంతో మోహన్‌బాబు సంప్రదాయబద్ధంగా పిడసల గంగమ్మ వారికి సారెను మోసుకువచ్చి సర్పంచ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ రవిశేఖర్, రంగంపేట సర్పంచ్ తాటిమాకుల యర్రయ్య, ఎంబియు విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మను దర్శించుకున్న ఎంఎల్ఏ చెవిరెడ్డి



చంద్రగిరి, మే 31 ప్రభాతవార్త:

సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారిని బుధవారం ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు గావించారు. అనంతరం ఆయన ఆలయ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుండి జాతీయ రహదారికి రోడ్డు అనుసంధానం, గర్భాలయం ఆధునీకరణ, ముఖమండపం, పరివార దేవతమూర్తుల ఆలయాల ఆధనీకరణ వంటి అంశాలపై సమీక్షించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే అన్నదానంపై ఆరా తీశారు. ఆలయ పునర్నిర్మాణ పనులకు దాతల సహకారంపై అడిగితెలుసుకున్నారు.

## పిడసల గంగమ్మ వారికి చెవిరెడ్డి సారె

చంద్రగిరి, మే 31 ప్రభాతవార్త:



మండల పరిధిలోని రామిరెడ్డి పల్లి పంచాయతీలో జాతర వేడుకలను పురస్కరించుకుని బుధవారం వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పిడసల గంగమ్మ వారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, కొటాల పద్మజ దంపతులు ఘన స్వాగతం పలికారు. తుమ్మలగుంటలోని శ్రీకల్యాణవెంకటేశ్వరస్వామి వారి ఆలయం నుండి సారెను మోసుకువచ్చి అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పొగాకు ప్రాణానికి చేటు

రేణిగుంట, మే 31 ప్రభాతవార్త:



పొగాకు ఉత్పత్తులు ప్రాణానికి హానికరమని ఆకాంక్ష స్వచ్ఛందసేవా వ్యవస్థాపకుడు డాక్టర్ మర్దాల రవిబాబు అన్నారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ, మానవ హక్కులు సామాజిక అభివృద్ధి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, టాటా ట్రస్టు, చదలవాడ డెంటల్ కాలేజీలు సంయుక్తంగా పొగాకు ఉత్పత్తుల వినియోగం వాటి నష్టాలపై అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమానికి ముందు టాటా ట్రస్టు, డెంటల్ కాలేజీ వైద్యులు పలువురికి దంత, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు నమలడం, ధూమపానం చేయడం ప్రాణాంతకం అని తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట సర్పంచ్ నాగేషం, పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, చదలవాడ డెంటల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. శిరీష, టాటా ట్రస్టు చిత్తూరు జిల్లా కో-ఆర్డినేటర్ హేమంత్‌కుమార్, ఆకాంక్ష వ్యవస్థాపకులు డా. మర్దాల రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

రేణిగుంట, మే 31 ప్రభాతవార్త:

రేణిగుంట జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలో ఇంటర్ బహిరంగ అడ్మిషన్లు జరుగుతున్నట్లు ప్రధాన చార్యులు విష్ణువర్ధని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో చేరాలనుకున్న విద్యార్థినులు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, 9885140255 నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

పని వేళల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో వుండాలి

## కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుల సమస్యలపై 3045 యూనియన్ వినతి



తిరుపతి ప్రెస్‌క్లబ్,మే 31 ప్రభాతవార్త:

నిన్నటి రోజు విజయవాడలో విద్యుత్ యాజమా న్యంతో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం (3045) తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కాశీ మధుబాబు,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర్‌లు విజిలెన్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లారెడ్డిని బుధవారం విద్యుత్ సౌధలో కలిసి వినతిపత్రం అందచేశారు.అనంతరం వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో మూడవ పార్టీ విధానాన్ని రద్దు చేసి నేరుగా జీతాలు అందచేయాలన్నారు.2022 పిఆర్‌సితో కలిపి డిఏ మరియు ఇంక్రిమెంట్లతో కూడిన వేతనాలు చెల్లించాలన్నారు.ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు,20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.యూనియన్ రాష్ట్ర నాయకులు శరత్‌కుమార్,హేమకుమార్,కృష్ణా,అనంతపురం,కర్నూలు జిల్లాల అధ్యక్షులు రాజశేఖర్,హనుమంతనాయుడు,సూరి,నాయకులు ప్రసాద్,మురళి,కృష్ణ,ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

